# పాపం; 'పసి' వాడు?

ఆదివారం పొద్దున్ననంగా మొదలుపెట్టారు వీధిలో ఏదో కరెంటు పని. 'సాయంకాలం ఆరుగంటల కిస్తాంగా' అంటున్నాడు ఎన్నిమాట్లు ఎంతమంది అడిగినా. ఇంట్లో కూర్చుని బోరు కొడుతోంది. మూడుగంటల వరకు ఎలాగో భరించాను. చివరికి మూర్తి గారింటి కెళితే బాగుంటుందని తోచింది. పక్క యింటికెళ్ళి మూర్తిగారి పక్క యింటికి ఫోన్ చేశాను. రెండు నిమిషాల్లో మూర్తి లైనుమీది కొచ్చాడు.

"చాలా కాలంగా అనుకొంటున్నాను మీ యింటి కొద్దామని" అన్నాను.

"వెల్కమ్."

"ఇప్పుడు మీకు ఖాళీయేనా?" అన్నాను.

"ఓ!"

"అయితే, వచ్చేస్తున్నా" అని ఫోను పెట్టేయబోయాను.

"హలో, హలో" అంటూ ఆక్రందన.

"హలో."

"అమ్మయ్య! వున్నారుగా, లైన్లో?"

"ఆఁ వున్నాను, చెప్పండి!"

"ఒచ్చేటప్పుడు- మీరేమీ అనుకోనంటే—"

"చెప్పండి."

"—మరేం లేదు, మా ఆవిడకి ఒంట్లో బాగులేదు. పొద్దుట్నుంచీ మంచం ఎక్కింది. ఏదో నాకు చాతనైంది ఇంత ఉడకేసుకు తిన్నాను. మీరొస్తే ఏమీ యివ్వలేనేమో— దార్లో కమలా విలాస్ దగ్గర ఆగి ఏవైనా టిఫిన్లు పొట్లాలు కట్టించి తెండి. నేను మీరు రాగానే పే చేస్తాను!"

"అయ్యో! ఈ మాత్రం దానికేనా ? మీరు పే చెయ్యడం సంగతికేం లెండిగాని, తెస్తాను !" అని ఫోను పెట్టేశాను.

హోటల్ దగ్గిర ఆగి, మా ఇద్దరికీ టిఫిన్లు, ఆవిడకోసం పళ్లు పట్టించుకుని వెళ్ళాను. మూర్తిగారి భార్య మంచంమీద నుంచి ఈజీ ఛేర్లోకి మారింది. అతికష్టంమీద పళ్ళు తిన్నది.

అరగంట గడిపి, వచ్చేస్తూ వుంటే "ఉండండి, మీకు బిల్లు పే చెయ్యాలి" అని అతను పట్టుపట్టడం, నేను "ఎంతమాట ? ఈ మాత్రం దానికి మీరు పే చెయ్యాలా" అంటూ నేను పడనివ్వకపోవడం, అతను వోడిపోవడం జరిగింది.

నేను ముందే అనుకున్నాను. "మా ఇంటికొస్తే ఏం తెస్తావు, మీ ఇంటికొస్తే ఏం పెడతావు" అనే రకాలు కొందరుంటారని- అని సాధించింది మా ఆవిడ.

"నీ మొహం, రేపు మనకే అలాంటి ఇబ్బందొస్తే ఆయన సాయం చెయ్యరేంటీ ?'' అన్నాను.

"ఆవిడకేం పొయ్యేకాలం లేదు. నిన్న చిలకలా సింగారించుకుని సినిమాకి వొచ్చింది."

"మరేం? అందుకే పొద్దుటికల్లా ఖాయిలా పడ్డది'' అని సినిమాల మీద నా కసిని వెలిబుచ్చాను.

"ఆయన సంగతి మీకు తెలీనట్టు వెనకేసుకొస్తున్నారు" అని మా ఆవిడ మళ్ళా సణిగింది.

"ముందుగా చెప్పే వస్తాడు. కాని పండగనాడో, ఆదివారంనాడో సరిగ్గా మనం ఖాళీగా కూర్చుని చిరుతిళ్లు తినే సమయానికి తయారవుతాడు !" అని మా ఆవిడ కంప్లెయింటు, మూర్తిగారి మీద. "చిన్న విషయం మీతో మాట్లాడాలి" అంటూ గుమ్మంలోంచి పలకరించి, రెండు గంటలసేపు అంతర్జాతీయ రాజకీయాల నుంచి ఆవకాయ నిర్మాణం దాకా చర్చించి వెళతాడు.

"పోన్లే'' అన్నాను; ఓడిపోయానని చెప్పడం ఇష్టంలేక.

సరిగ్గా నాలుగురోజుల తర్వాత, నేను ఆఫీసుకి సెలవుపెట్టి వుండిపోయాను. ఆ రోజు "తలనొప్పి, జ్వరం'' అని కారణం రాసి. అసలు కారణం ఆ రోజు నా పుట్టినరోజు. ముందురోజు నా దగ్గిర మూర్తిగారు పది రూపాయలు అప్పు తీసుకున్నాడు. "రేపు ఆఫీసులో ఇస్తా"నని, "రేపు నేను శలవు పెడుతున్నాను! సరే ఎల్లుండివ్వండి, పోయిందేముంది?" అన్నాను.

మధ్యాహ్నం మూడున్నరైంది. మా ఆవిడ నాకోసం స్పెషల్ స్వీటుచేసి చల్లారుస్తోంది, వచ్చేశాడు మూర్తిగారు.

''హేపీ బర్త్‌డే టు యూ" అని పది రూపాయల కాగితం ప్రెజెంటేషన్‌లా చేతిలో పెట్టాడు.

''థాంక్స్." అని, మా ఆవిడిని పిలిచి అతనికి స్వీటు పెట్టమన్నాను.

''నాకు నిన్ననే అనుమానం తగిలింది. సెలవు పెడతానన్నారు ఎందుకా అని. పొద్దుట మీ లీవ్ లెటర్‌లో తలనెప్పి, జ్వరం అని ఉంది. అనుమానం బలపడింది. సర్వీస్ రిజిష్టర్ చూశాను. ఇంకేముంది? నిజం తెలిసిపోయింది ఎట్లాగయినా ఆరో తేదీని, పదిహేనవ తేదీని, యిరవై నాలుగో తేదీని పుట్టినవాళ్లు కళాపిపాసు లవుతారని సంఖ్యాశాస్త్రం చెబుతూంది. మీ విషయంలో సరిగ్గా అలాగే జరిగింది!" అన్నాడు మూర్తిగారు; అప్పుడే మైసూర్‌పాక్ నోట్లో వేసుకొంటూనూ.

''మైసూర్‌పాక్ నాచేత సరిగ్గా కాదండి" అంది మా ఆవిడ సన్నాయి నొక్కు నొక్కుతూ, నావైపు వోరకంట చూస్తూ.

''అదేం లేదు, అద్భుతంగా కుదిరింది!'' అని గ్లాసుడు నీళ్లుతాగి, ''మీరేం అనుకోకపోతే ఇంకొక్కటి తగల్నియ్యండి నాకు" అన్నాడు మూర్తిగారు.

మా ఆవిడతో అన్నాడు.

నాతో అంటే నిజంగానే తగల్నిద్దును.

(17-2-79)